

మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఫ్లెక్సీల వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# మున్సిపల్ ఆఫీసా? కాంగ్రెస్ కార్యాలయమా?

## మందమర్రిలో బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించేందుకు సిబ్బంది యత్నం

- అడ్డుకుని ఆందోళన నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు
- మున్సిపల్ సిబ్బంది గోబ్యాక్ అంటూ నినాదాలు
- బల్దియా కార్యాలయ గుమ్మానికి వినతి పత్రం



మున్సిపల్ కార్యాలయ గుమ్మానికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు



మందమర్రిలో మున్సిపల్ సిబ్బందితో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

మందమర్రి, జూన్ 3 : మందమర్రి మున్సిపాలిటీలో ఫ్లెక్సీల వివాదం తారాస్థాయికి చేరింది. పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది పూనుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని ఫ్లెక్సీల తొలగింపును అడ్డుకున్నారు. మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ సిబ్బంది గో బ్యాక్, కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని కార్యాలయ ప్రధాన గేటు ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వద్ద నిరసన తెలిపారు. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట భారీ ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వినతి పత్రం సమర్పించేందుకు నాయకులు ప్రయత్నించగా.. కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేరని సిబ్బంది తెలిపారు. వినతి పత్రం తీసుకోవాలని సిబ్బందిని కోరినా వారు అందుకు నిరాకరించారు. దీనితో నాయకులు వినతి పత్రాన్ని కార్యాలయ గుమ్మానికి సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారుల వెంట విచ్చలవిడిగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పట్టించుకోని అధికారులు కేవలం బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు? మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం ఇరుపక్కల కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ఇది మున్సిపల్ కార్యాలయమా? లేక కాంగ్రెస్ కార్యాలయమా? అనే విధంగా ఉందని వారు మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి అధికార పార్టీ సేవలో మునిగి తెలాగుతున్నాడని వారు ఆరోపించారు. తాము ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పై వినతి



మందమర్రి పాత బస్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పత్రం ఇవ్వడానికి వస్తే తీసుకోక పోవడం తాము ఆరు నెలల క్రితం ప్రమాదకరంగా ఉన్న ఫెక్సీలను తొలగించాలని వినతి పత్రం సమర్పించామని అయినా పట్టించుకోలేదన్నారు. రోడ్డు కూడళ్ల వద్ద ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించాలంటే చర్యలు తీసుకోక లేదన్నారు. మున్సిపాలిటీలోని 24 వార్డులలో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కేవలం రెండే ఉన్నాయని వారు తెలిపారు. మున్సిపాలిటీలో ఎన్నికలు లేవని గిరిజన చట్టం అమలులో ఉందని ఎవరు ప్రజాప్రతినిధులు లేరని వారు పేర్కొన్నారు. రహదారుల వెంట ఫ్లెక్సీల మూలంగా రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగి ఎంతో మంది గాయాలపాలయ్యారని వారు పేర్కొన్నారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎవరి ఫ్లెక్సీలు, జెండాలు తీయలేదని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు తొలగిస్తే అందరివి తొలగించాలని, తమ ఫ్లెక్సీలను తామె తొలగిస్తామని వారు అన్నారు. అంతే కానీ అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో భవనాలకు ఎత్తు భాగంలో ఉన్న తమ ఫ్లెక్సీలను తొలగించడం బావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఓ.రాజశేఖర్, బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, బత్తుల శ్రీనివాస్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, ఎండి.అబ్బాస్, పంజాల ఈశ్వర్, భట్టు రాజ్‌కుమార్, భూపెల్లి కనకయ్య, ప్రతాప్ సారంగపాణి, బర్ల సదానందం, పల్లె నర్సింగ్, బెల్లం అశోక్, సీపెల్లి సాగర్, అఖిలేశ్ పాండే, కొమరక్క పాల్గొన్నారు.

ఎల్ఐసీ కాలనీలో మూసి ఉన్న రేషన్ షాపు ఎదుట సంచులను క్యూలైన్‌లో పెట్టిన లబ్ధిదారులు



# సన్నబియ్యానికి సర్వర్ కష్టాలు



ఎన్టీఆర్ నగర్‌లో మూసి ఉన్న రేషన్ దుకాణం

*వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా లబ్ధిదారులకు అవసరమయ్యే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేసిన రేషన్ దుకాణాలకు పంపిణీ చేశారు. మంచిర్యాల జిల్లాలో జూన్ 2 నుంచి బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు డీలర్లు లబ్ధిదారుల కు బియ్యం పంపిణీ చేయనున్నారు. బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు రేషన్ దుకాణాల ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తుంది. మూడు నెలల బియ్యం కోసం యంత్రంపై ఆరు సార్లు వేలి ముద్ర ఉంచాల్సి వస్తుంది. దీంతో పంపిణీలో తీవ్రజాప్యం జరుగుతుం డడంతో లబ్ధిదారులు దుకాణాల ఎదుట నిల్చోవాల్సి వస్తుంది. గత నెల వరకు కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పన అందించేవారు. ఒకసారి వేలిముద్ర పెడితే సరిపోయేది. లబ్ధిదారులు 15 నిమిషాల్లో బియ్యం తీసుకుని పోయేవారు. ఇప్పుడు బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయం పడుతుంది.*

*- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్(నమస్తే తెలంగాణ)*



మంచిర్యాల మార్కెట్ ఏరియాలోని రేషన్ దుకాణం వద్ద క్యూలైన్‌లో లబ్ధిదారులు

# అధికార పార్టీలో విభేదాలు

- చెన్నూర్ కాంగ్రెస్‌లో ముదిరిన గ్రూపు రాజకీయాలు
- పరస్పర విమర్శలతో హస్తం పార్టీలో గందరగోళం



మాట్లాడుతున్న రాజిరెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్, జూన్ 3 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ముదిరాయి. ఇన్నాళ్లుగా లోపలే పరిమితమై ఉన్న విభేధాలు ఇప్పుడు బహిరంగంగా ప్రదర్శనకు దిగాయి. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడంతో బహిర్గతమయ్యాయి. చెన్నూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సంస్థత గత సమేశాల సందర్భంగా వెలుగులోకి వచ్చిన తాజా సంఘటనలు, పార్టీ అంతర్గత సమస్యలు ప్రతి బింబిస్తున్నాయి. కొద్ది రోజుల నుంచి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అనుకూలంగా ఉన్న ఒక వర్గం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి నేతృత్వంలోని మరోవర్గం గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఇటీవల చెన్నూర్‌కు పార్టీ పరిశీలకుడు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై మూల రాజిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రాజిరెడ్డి మాటలు వివాదస్పదం కావడంతో, అప్పట్లో ఎమ్మెల్యే వివేక్‌కు అనుకూలంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి మూల రాజిరెడ్డిపై విమర్శలు చేశారు. అయితే దానికి కౌంటర్‌గా మూల రాజిరెడ్డి తన వర్గానికి చెందిన నాయకులతో మంగళవారం చెన్నూర్‌లోని తన ఫంక్షన్ హాల్‌లో అంతర్గత సమావేశం నిర్వహించారు. అనంతరం రాజిరెడ్డి తరపున తన వర్గం నాయకులు పోగుల సతీశ్, ముత్యాల రవికుమార్, స్వామి, స్వరూప్‌సింగ్ చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి, ఎంపీగా వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేసిన మూల రాజిరెడ్డిపై విమర్శలు చేయడం వారికి తగదని హెచ్చరించారు. ఇలా పరస్పర విమర్శలపై ఈ గ్రూపు రాజకీయాలు ఎక్కడికి దారి తీస్తాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# వార్డుల పునర్విభజనకు షెడ్యూల్

మంచిర్యాలటౌన్, జూన్ 3 : మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో వార్డుల పునర్వవిభజనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. మంచిర్యాల మున్సిపాలిటీతో పాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని ఏడు గ్రామాలను కలుపుతూ మంచిర్యాల కార్పొరేషన్‌గా జనవరి 27న గెజిట్ విడుదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డుల సరిహద్దులు, జనాభా ప్రాతిపదికన అధికారులు ఇప్పటికే డ్రాఫ్ట్‌ను తయారు చేశారు. ఈ నెల 5 నుంచి 11 తేదీ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ సూచనలు తెలియజేయాలి, 12 నుంచి 16వ తేదీ వరకు ప్రజల నుంచి వచ్చిన సూచనలు పరిశీలించి పరిష్కరిస్తారు. కలెక్టర్, మున్సిపల్ పరిపాలన శాఖలకు రిపోర్టులు పంపిన అనంతరం 21న వార్డుల ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

# వంద రోజుల ప్రణాళికకు శ్రీకారం

## పూర్తి స్థాయిలో అమలైతే ప్రజలకు మేలు

మంచిర్యాలటౌన్, జూన్ 3 : నగరంలో మౌలిక వసతులతో పాటు పారిశుధ్యంపై దృష్టి పెట్టి వర్షాకాలంలో వ్యాప్తించే సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు రోజువారీగా అన్ని నగరాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పనులు రూపొందించారు. ఈ ప్రణాళికలో భాగంగా పారిశుధ్యంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను వేరు చేయడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లాంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. మురుగు, వరద కాలువల శుభ్రత, రోడ్ల పక్కల చెత్త, పిచ్చి మొక్కల తొలగింపు, రసాయనాల ద్వారా దోమల నియంత్రణ ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మలేరియా, డెంగా వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ స్వచ్ఛ నడక, మాస్ శానిటేషన్ డ్రైవ్‌లు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. రోడ్లపై పేరుకుపోయిన ఇసుక, మట్టి తొలగించనున్నారు.వీధి కుక్కల నియంత్రణకు వాటిని పట్టి యానిమల్‌కేర్ సెంటర్‌కు తరలించనున్నారు. తాగు నీటి బావులు, రిజర్వాయర్లలో క్లోరినేషన్, నల్లా కనెక్షన్లను ఆన్‌లైన్ చేయడం, ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలను సాగిస్తున్న వారిని గుర్తించి లైసెన్స్ మంజూరు చేయడం, భువన్ సర్వే ద్వారా భవనాల కొలతలు తీసుకుని అసెస్‌మెంట్లు చేసి అదనంగా ఉన్న నిర్మాణాలకు పన్నులు విధించడం చేపడుతారు. వర్షాకాలంలో ప్రమాదకరంగా మారే శిథిలాభవనాలను గుర్తించి తొలగించనున్నారు. వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం, వ్యాపారాలకు అనువుగా ఉండే ప్రాంతాలను కేటాయించడం వంటి చర్యలు చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వంద రోజుల సమర్థవంతంగా అమలుచేస్తే ప్రజలకు మేలు కలగనున్నది.



గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారిణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 3 : క్రీడారంగంలో ప్రతిభను నిరూపించుకుంటూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఇటీవల నిర్వహించిన అత్యాపత్య ఆసియా కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి సుహాసినిని మంగళవారం తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీ బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. సుహాసిని గోల్డ్ మెడల్ సాధించడం సాధించడం జిల్లా పేరు దేశదిగ్విజయంగా మారిందని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఆసియా కప్ పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన రూ.25వేలు ఆర్థిక సాయం ఎమ్మెల్యేకు క్రీడాకారిణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ రాకేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.